ఆంధ్రజ్యోతి



5 నంద్యాల జిల్లా వార్తలు

ఆదివారం 17 మార్చి 2024



రంజాన్ వేళలు
ఇఫ్తార్ సాయంత్రం గంటల 6.23(ఆదివారం)
సహేరీ ఉదయం గంటల5.02 (సోమవారం)

సార్వత్రిక సమరానికి నగారా మోగింది. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ శనివారం విడుదల చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) శనివారం పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో రాజకీయ పార్టీలు, ప్రభుత్వ విభాగాలు అప్రమత్తమయ్యాయి. షెడ్యూల్ వెలువడడానికి ముందు రోజు వరకు వైసీపీ ప్రజా ప్రతినిధులు, ఆ పార్టీ నేతలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేశారు. షెడ్యూల్ రాకతో ఒక్కసారిగా గప్‌చుప్ అయ్యారు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలో నాలుగో విడత ఎన్నికలు జరుగుతాయి. నోటిఫికేషన్ రావడానికి నేటితో 33 రోజులు, పోలింగ్‌కు 58 రోజులు ఉంటుంది. ఇది అభ్యర్థులకు ఖర్చుతో కూడుకున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. శనివారం నుంచే కోడ్ అమలులోకి రావడంతో నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడే కార్యక్రమాలు ఆపేశారు. ఎన్నికలను టీడీపీ, వైసీపీలు ప్రత్యేక సవాల్‌గా తీసుకోవడంతో నవనందుల కోటలో ఈసారి సార్వత్రిక సమరం రసవత్తరంగా మారనుంది.



మోగిన నగారా

- షెడ్యూల్ ప్రకటనతో పార్టీలు అప్రమత్తం
- అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్
- మే 13న ఓటింగ్, జూన్ 4న కౌంటింగ్

నంద్యాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమల్లోకి రావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. సచివాలయాల్లోని అధికార పార్టీ సామగ్రి బయటకు తరలిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ రాగానే జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల ప్రక్రియలో పాలు పంచుకునే వివిధ విభాగాల అధికారులతో జిల్లా అధికారులు సమీక్ష జరిపారు. కోడ్ అమలులోకి వచ్చినందున మద్యం, నగదు అక్రమ రవాణా సహా ఆన్‌లైన్ లావాదేవీలపైన నిఘా ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు ఇప్పటికే వెల్లడించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఇక షెడ్యూల్ విడుదలవగానే జిల్లాలోని రెండు ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ అభ్యర్థుల్లో హుషారు వచ్చింది. ఇప్పటికే టీడీపీ జిల్లాలోని ఎంపీ సీటు మినహా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించగా, వైసీపీ కూడా శనివారం తమ అభ్యర్థులను ప్రకటించింది. నంద్యాల పార్లమెంట్ స్థానానికి సిట్టింగ్ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డినే ఖరారు చేస్తూ సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు. అభ్యర్థుల ప్రకటనతో ఇరువర్గాలు సమరానికి సిద్ధమయ్యారు.



కోడ్ వచ్చేసింది

ఎన్నికల షెడ్యూల్ వెలవడటంతో శనివారం నుంచి కోడ్ అమలులోకి వచ్చింది. సోషల్ మీడియాలో రాజకీయ ప్రకంపనలు సృష్టించేలా పెడుతున్న పోస్టింగ్‌లపై ప్రత్యేక నిఘా ఉంటుంది. అభ్యంతరకరమైన, మతపరమైన పోస్టులు పెట్టిన వారిపైనే కాకుండా గ్రూప్ అడ్మిన్‌పై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. రాజకీయ పార్టీ నాయకులు కులాలు, మతాలు, వేర్వేరు భాషలు మాట్లాడే ప్రజల మధ్య విభేదాలు, వైషమ్యాలు సృష్టించే పనులకు పాల్పడితే చర్యలు తీసుకుంటారు. నిర్ధారణ, రుజువులు లేకుండా ప్రత్యర్థి పార్టీ నాయకులపై తప్పుడు ఆరోపణలు చేయకూడదు. ఓట్ల కోసం కులాభిమానం, మత విశ్వాసాలు వాడుకోకూడదు. దేవాలయాలు, మసీదులు, చర్చీలు సహా ఇతర ప్రార్థనా మందిరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయ పార్టీలు, బరిలో ఉండే అభ్యర్థులు ఎన్నికల ప్రచారం కోసం ఉపయోగించుకోరాదు. కోడ్ అమలులోకి వచ్చిన క్షణం నుంచి ఎవరూ రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లరాదు. ఒకవేళ తీసుకెళ్లాల్సి వస్తే అందుకు ఆధారాలు చూపించాల్సి ఉంటుంది.



బండి ఆత్మకూరులో ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేస్తున్న దృశ్యం

నోటిఫికేషన్	: 18 - 04 - 2024
నామినేషన్ల గడువు	: 25 - 04 - 2024
నామినేషన్ల పరిశీలన	: 26 - 04 - 2024
ఉపసంహరణ	: 29 - 04 - 2024
పోలింగ్ తేదీ	: 13 - 05 - 2024
ఓట్ల లెక్కింపు	: 04 - 06 - 2024

ప్రధాన పార్టీలు ప్రకటించిన అభ్యర్థులు

నియోజకవర్గం	టీడీపీ	వైసీపీ
నంద్యాల	ఎన్ఎండీ ఫరూక్	శిల్పా రవిచంద్రా రెడ్డి
నందికొట్కూరు(ఎస్సీ)	గిత్తా జయసూర్య	ధారా సుధీర్
ఆళ్లగడ్డ	భూమా అఖిలప్రియ	గంగుల బిజేంద్రనాథ్ రెడ్డి
డోన్	కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి	బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి
బనగానపల్లె	బీసీ జనార్దన్ రెడ్డి	కాటసాని రామిరెడ్డి
శ్రీశైలం	బుడ్డా రాజశేఖర్ రెడ్డి	శిల్పా చక్రపాణి రెడ్డి
పాణ్యం	గౌరు చరిత	కాటసాని రాంభూపాల్‌రెడ్డి



జీవితాలతో పేకాట..!

- కోట్ల రూపాయలు చేతులు మారుతున్న వైనం
- ఏజెంట్ల ద్వారా జూదరుల తరలింపు
- ఐదారు జిల్లాల నుంచి నంద్యాలకు వస్తున్న పేకాటరాయుళ్లు
- ఆట మత్తులో పడి అప్పుల పాలవుతున్న తీరు
- నంద్యాలలో దిగిన కడప బ్యాచ్

● నంద్యాలకు చెందిన ఓ వ్యక్తి వ్యాపారంలో బాగానే సంపాదించాడు. సంఘంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. కొద్దిరోజుల కిందట స్నేహితుడి ద్వారా కొలిమిగుండ్లలోని ఓ పేకాట స్థావరానికి అలవాటయ్యాడు. అది వ్యసనంగా మారడంతో మానుకోలేకపోయాడు. దీంతో ఇంటిని రూ.20 లక్షలకు తాకట్టు పెట్టాడు. ప్రస్తుతం నంద్యాలలోని ఖరీదైన మరో ఆరు సెంట్ల స్థలాన్ని అమ్మేందుకు సిద్ధమయ్యాడు. దీంతో అతడి కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు.

● నంద్యాలకు చెందిన మరో వ్యక్తిది కూడా ఇదే పరిస్థితి. నెమ్మదిగా అలవాటైన పేకాటను మానుకోలేక, పేకాట నిర్వాహకులు ఉచ్చులో నుంచి బయటకు రాలేక దాదాపు రూ.15 లక్షలు పోగొట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఇద్దరూ ఏళ్ల తరబడి పేకాట ఆడుతూ ఆస్తులు కరగదీసుకున్నారంటే పొరబాటే! కేవలం ఆరు నెలల వ్యవధిలోనే ఈ స్థాయిలో డబ్బులు పోగొట్టుకున్నారు. వెలుగులోకి వచ్చినవి ఈ రెండు ఉదంతాలే కాగా బయటపడనవి ఇంకె ఉన్నాయో..

నంద్యాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నంద్యాల, కొలిమిగుండ్ల, సంజామల, బనగానపల్లె వంటి పరిసర ప్రాంతాల్లో కేసినో తరహాలో జరుగుతున్న జూదం వల్ల చాలామంది బాధితులు ఆస్తులు కరగదీసుకుంటున్నారు. దీనికి తోడు జిల్లా కేంద్రమైన నంద్యాల శివారులో కడప బ్యాచ్ ఒకటి తాజాగా దిగింది. 10 రోజులు ఎలాంటి ఇబ్బంది లేకుండా పేకాట నిర్వహించుకునేందుకు రూ.20 లక్షలు ఓ పోలీసు పెద్ద సారుకు సమర్పించినట్లు సమాచారం. ఇలా పోలీసుల అండతోనే జూద నిర్వాహకులు రెచ్చిపోతుండటంతో జిల్లాలో వారి వ్యాపారం 'మూడు ఆటలు, ఆరు షోలు' చందాన నడుస్తోంది. నిర్వాహకులు, డబ్బులు దండుకునే పోలీసులు బాగానే ఉన్నా సామాన్యులు మాత్రం తమ కుటుంబాలను రోడ్డు పాలు చేసుకుంటున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకోవాల్సిన వారే దగ్గరుండి మరీ నడిపిస్తుంటే తమ ఆవేదన ఎవరికి చెప్పుకోవాలి? అని బాధితుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడికో ఎందుకని..

గతంలో పేకాట ఆడాలంటే క్లబ్బులకు వెళ్లేవారు. అయితే ప్రభుత్వాలు క్లబ్బుల మీద నియంత్రణ తీసుకురావడంతో పేకాటరాయుళ్లు గోవా, బ్యాంకాక్ వంటి కేసినోలకు వెళ్లేవారు. కేసినో వ్యవహారాలను ఒంటబట్టించుకున్న కొంతమంది అలాంటివి ఇక్కడ నిర్వహిస్తే ఆదాయం దండిగా సమకూరుతుందని భావించారు. దానికి అనువుగా నంద్యాల జిల్లాను ఎంచుకున్నారు. ఇక్కడి కొండలు, గుట్టలు, స్థానిక నాయకుల గోడౌన్లు, శివారుల్లోని తోటల్లో స్థావరాలు ఏర్పాటు చేశారు. ఫలానా చోట్ల పేకాట నిర్వహిస్తున్నామంటూ జూదరులకు మెసేజ్‌ల ద్వారా తెలియజేస్తున్నారు. ఆటకు రావాలనుకునే వారు ఎవరిని కలవాలి? ఎక్కడకు రావాలి? స్థావరం ఎక్కడ? వంటివన్నీ ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నారు. అంతా బాగుందనుకున్న తర్వాత జూదరులను ఆయా స్థావరాలకు తరలిస్తున్నారు. వ్యవహారం అంతా పకడ్బందీగా ఉండటం, పోలీసుల దాడుల భయం కూడా లేకపోవడంతో పేకాటరాయుళ్లు రోజూ వందల సంఖ్యలో నంద్యాల జిల్లాకు చేరుకుంటున్నారు. ఇలా వచ్చే జూదరుల్లో కేవలం జిల్లాకు చెందిన వారే కాకుండా, కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, ఒంగోలు వంటి జిల్లాల నుంచి కూడా వస్తున్నారు. దీనిని బట్టి జిల్లాలో జూదం ఏ స్థాయిలో హెచ్చుమీరిపోయిందో అర్థం చేసుకోవచ్చు.

ఏజెంట్ల ద్వారా..

పేకాట ఆడే ప్రాంతాన్ని చూసిన కొత్తవారికి ఎవరికైనా.. అక్కడ ఏదైనా జాతర గానీ తిరుణాల గానీ జరుగుతున్నాయేమోనన్న అనుమానం కలుగుతుంది. వందల సంఖ్యలో కార్లు బారులు తీరి ఉంటాయి. ఎక్కడెక్కడి వారికి ఇక్కడ పేకాట ఆడే స్థావరం ఎలా తెలుస్తుంది? అన్న అనుమానం రాక మానదు. అయితే దీని వెనుక పెద్ద నెట్‌వర్కే ఉంది. పేకాట స్థావరాలు ఎక్కడ? ఎన్ని గంటలకు? మొదలవుతుందని అనే విషయాన్ని జూదరులకు తెలియజేసేందుకు నిర్వాహకులు ఏజెంట్లను నియమించుకున్నారు. ఏజెంట్ల ద్వారా సెల్‌ఫోన్ మెసేజ్‌లు పంపిస్తారు. వచ్చే వారిని ఏజెంట్లు తీసుకువెళతారు. వీరి ద్వారా కాకుండా కొత్తవారెవరినీ పేకాట అడ్డాకు అనుమతించరు. ఆటగాళ్లను తీసుకువచ్చినందుకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున ఏజెంట్లకు కమీషన్ అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఫొటోలు తీసి, ఫోన్లు చేసి ఎవరికైనా సమాచారం ఇస్తారన్న ముందస్తు అనుమానంతో ఇక్కడికి సెల్‌ఫోన్లను అనుమతించరు. పేకాట స్థావరాల చుట్టూ ఐదు కిలోమీటర్ల పరిధిలో వీరి మనుషులు కాపలాగా ఉంటారు. ఎవరైనా కొత్తవారు వస్తే వెంటనే నిర్వాహకులకు సమాచారం అందిస్తారు. ఇతరులు ఎవరైనా ఆ చుట్టు పక్కలకు వస్తే తరిమేసేందుకు బౌన్సర్ల వంటి వారిని కూడా నియమించుకుంటున్నారంటే వీరి దందా ఎంత పకడ్బందీగా జరుగుతుందో తెలిసిపోతోంది.

● ఇన్‌స్టంట్ ఫైనాన్స్... రవాణా సౌకర్యం...

పేకాట నిర్వాహకులు జల్సారాయుళ్లకు అన్ని సకల సౌకర్యాలను కల్పిస్తారు. పేకాట నిర్వహణ స్థలం ఎక్కడో ముందుగానే చెబుతారు. సొంత కార్లలో వెళితే ఇబ్బందవుతుందని వారి కోసం కారును పంపిస్తారు. ఒకసారి అలవాటైన వారు ఏదైనా అనివార్య కారణాల వల్ల వెళ్లలేని పరిస్థితి ఉంటే.. ఫోన్లు చేసి ఇవాళ ఆట బాగుంది, ఫలానా వాళ్లు ఇన్ని లక్షలు గెలుచుకున్నారంటూ ఆశలు కల్పిస్తారు. ఇక పేకాట ఆడటానికి వెళ్లి పర్సు ఖాళీ చేసుకుంటే.. అప్పు ఇచ్చే సౌకర్యాన్ని కూడా నిర్వాహకులే కల్పిస్తున్నారు. లక్షకు రెండు వేల చొప్పున ముందుగానే మినహాయించుకుని తమ మనుషులతోనే డబ్బులు ఇప్పిస్తారు. అప్పు తీసుకున్న వ్యక్తి పది రోజుల తర్వాత పేకాట ఆడటానికి వెళితే రోజుకు రెండు వేల చొప్పున వడ్డీ రూ.20 వేలు, అసలు లక్ష రూపాయలు చెల్లించిన తర్వాతే ఆటలో కూర్చోవాల్సి ఉంటుంది. అప్పు తీసుకున్న వ్యక్తి అందుబాటులో లేకపోతే, పేకాట నిర్వాహకుల తరపున మనుషులు నేరుగా వారి ఇంటికి వెళ్లి నానా యాగీ చేస్తారు. అవసరమైతే తమ దందాలో భాగస్తులైన పోలీసులను కూడా రంగంలోకి దింపుతారు. ఇలా వీరి ఉచ్చులో పడిన జూదగాళ్లు ఆస్తులు కరిగి, అప్పుల పాలవుతున్నా పేకాటను మానుకోలేకపోతున్నారు. వారి నుంచి తమవారిని కాపాడుకునేందుకు జూదరుల కుటుంబ సభ్యులు పడని పాట్లు లేవు.



● స్థావరాలు మారుస్తూ...

నంద్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో పేకాట నిర్వహణ అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. స్థానిక నాయకులు, పోలీసుల అండదండలు ఉన్నా.. విషయం ఎలాగోలా బయటకు పొక్కితే ప్రమాదమనే ఉద్దేశంతో పేకాట నిర్వాహకులు రోజుకోచోటుకు స్థావరాన్ని మారుస్తున్నట్లు తెలుస్తోంది. నంద్యాల చుట్టు పక్కల ప్రాంతాల్లోని కొద్ది రోజులు నల్లమల అటవీ ప్రాంతంలో ఒక రోజు, దగ్గరలోని మండలంలో ఒక రోజు, అనువుగా ఉండే మామిడి తోటల్లో ఒక రోజు పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇలా మార్చే విషయాన్ని ఆటగాళ్లగకు ముందుగానే తెలియజేస్తారు. ఇదే విషయాన్ని పోలీసులకు కూడా అందజేస్తారు. అయితే బనగానపల్లె నియోజకవర్గంలో పేకాట స్థావరాల్లో పెద్దగా మార్పేమీ లేనట్లు తెలుస్తోంది. ఇక్కడి స్థానిక నాయకుడికి ఎదురు చెప్పేవారు లేకపోవడం, సంబంధిత పోలీసు స్టేషన్ అధికారికి అందాల్సినవి అందుతుండటంతో జూద నిర్వాహకుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని తెలుస్తోంది. ఇప్పటికైనా యథేచ్ఛగా సాగుతున్న పేకాటపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



పెద్ద సారు కనుసన్నల్లోనేనా..?

జిల్లాలో పేకాట యథేచ్ఛగా జరగడానికి ఆ పోలీసు పెద్ద సారు హస్తం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో జరిగే జూదం దందా గురించి రెండు నెలల కిందట 'జోరుగా జూదం' పేరిట ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. వార్త వచ్చిన తెల్లారి కూడా బనగానపల్లె ప్రాంతలో పేకాట జరిగిందన్న విమర్శలు వినిపించాయి. కేవలం స్థానిక పోలీసులు అండదండలతోనే ఇంత విచ్చలవిడిగా పేకాట సాగడం అసాధ్యమన్న అభిప్రాయం ఉంది. ఇక ఆయా చోట్ల నిర్వహించే పేకాట స్థావరాల నుంచి ఆ సారుకు నెలకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు చేరుతున్నట్లు తెలుస్తోంది. ఇలా ఈ ఆరు నెలల కాలంలో ఆయన బాగానే వెనుకేసుకున్నట్లు సమాచారం. ఇక తాజాగా కొద్ది రోజుల కిందట కడపలో పేకాటను నిర్వహించే దందారాయుళ్ల మకాంను అక్కడి నుంచి నంద్యాల పట్టణ శివారులోనికి మార్చారు. ఇక్కడ ఓ పది రోజులు పేకాట నిర్వహించేందుకు అనువైన తోటలను ఎంచుకున్నారు. పోలీసులు ఆ వైపు కన్నెత్తి చూడకుండా ఉండేందుకు ఆ సారుకు రూ.20 లక్షలు సమర్పించుకుని మూడు రోజుల కిందట ఆటను మొదలు పెట్టినట్లు సమాచారం. ఇటీవల ఓ జూదరి కొలిమిగుండ్ల జూదస్థావరంలో ఉన్నాడని తెలుసుకున్న అతడి కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లారు. తమవాడిని పంపించండని, ఆయన పేకాట వల్ల ఇప్పటికే తమ కుటుంబం అప్పుల పాలైందని, ఇక పోగొట్టుకోవడానికి ఏమీ లేవని చెప్పి ప్రాధేయపడ్డారు. అయినా నిర్వాహకుల మనుషులు ఇక్కడ జూదం ఏమీ నడవటం లేదని, అలాంటి వారు ఎవరూ లేరని వెనక్కి తిప్పి పంపించారు. సామాన్యులకు స్థావరాలు ఎక్కడ ఉన్నదీ తెలుస్తుంటే పోలీసులకు తెలియకుండా ఉంటుందా? అన్న అనుమానం కలుగుతోంది.

మాల్ ప్రాక్టీస్ లేకుండా చర్యలు

- పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశాం
- ప్రశ్న పత్రం ఎక్కడ లీకైనా క్యూఆర్ కోడ్‌తో గుర్తింపు
- కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు
- రేపటి నుంచి పరీక్షలు ఆరంభం





నంద్యాల (కల్చరల్), మార్చి 16: ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు జరిగే పదో తరగతి పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో 10వ తరగతి పరీక్షల నిర్వహణ గురించి కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎక్కడ పేపర్ లీకేజీకి గురైనా తెలుసుకునేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. జిల్లాలో 134 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 134 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 134 మంది డిపార్టెమెంట్ అధికారులు, 5 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 1750 మంది ఇన్విజిలేటర్లను నియమించామని చెప్పారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రతి కేంద్రంలో అవసరమైన ఫర్నీచర్, అత్యవసర మందులతో ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు హాల్ టికెట్‌లో ఉండే నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి పెన్ను, పెన్సిల్, ఎరేజర్, ఎగ్జామ్ ప్యాడ్ తప్ప సెల్‌ఫోన్‌లు అనుమతించమన్నారు.

జిల్లా వ్యాప్తంగా 30,242 మంది విద్యార్థులు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 16 : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏ కేటగిరి పరీక్షా కేంద్రాలు 62, బీ కేటగిరిలో 57, సీ కేటగిరిలో 15 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఈవో సుధాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 24,223 మంది, ప్రైవేటు విద్యార్థులు 6,019 మంది ఉన్నారని చెప్పారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు 134 మంది, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు 134 మంది, అడిషనల్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు 32 మంది, ఫ్లయింగ్ స్క్వాడ్ 5 బృందాలు, ఇన్విజిలేటర్లు 1750 మంది విధులు నిర్వర్తించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్‌గా ప్రకటించామని అన్నారు. సిబ్బంది ఎవరూ పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్లను తీసుకుపోకూడదని సూచించారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 1,219 కేసుల పరిష్కారం



రోడ్డు ప్రమాద కేసుల బాధితులకు నష్టపరిహారం అందజేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్), మార్చి 16: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,219 కేసులు పరిష్కరించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు తెలిపారు. కర్నూలులో అత్యధికంగా 534 కేసులు నంద్యాలలో 176, డోన్‌లో 151, ఆదోనిలో 83, ఆళ్లగడ్డలో 44, ఆలూరులో 31, ఆత్మకూరులో 32, బనగానపల్లెలో 28, కోయిలకుంట్లలో 32, నందికొట్కూరులో 44, పత్తికొండలో 19, ఎమ్మిగనూరులో 45 కేసులు పరిష్కారమైనట్లు ఆయన తెలిపారు. కర్నూలులో రిటైర్డు జిల్లా న్యాయాధికారి ఆధ్వర్యంలో జరిగిన మరో లోక్ అదాలత్ బెంచిలో రోడ్డు ప్రమాదానికి సంబంధించిన 50 కేసులను పరిష్కరించి బాధితులకు రూ.4.50 కోట్ల మేర నష్టపరిహారాన్ని ఇప్పించారు. ఈ లోక్ అదాలత్‌లో ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి పి.పాండురంగారెడ్డి, జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.జ్యోత్స్నదేవి, ఎన్.వందన తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

టీడీపీ వస్తేనే రాష్ట్రం సుభిక్షం: జయసూర్య



అల్లూరులో మహిళకు కరపత్రాన్ని అందిస్తున్న నాయకులు

నందికొట్కూరు రూరల్, మార్చి 16: టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఆ పార్టీ నందికొట్కూరు నియోజకవర్గ అభ్యర్థి జయసూర్య అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో శుక్రవారం అంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని జయసూర్య టీడీపీ నాయకులతో కలిసి నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. టీడీపీని అధికారంలోకి తీసుకు రావడానికి పార్టీ శ్రేణులు శాయశక్తులా కష్టపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథరెడ్డి, మాండ్ర రత్నాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగళం ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏవీ సుబ్బారెడ్డి

నంద్యాల (కల్చరల్), మార్చి 16: చిలకలూరిపేట మండలం బొప్పూడిలో ప్రజాగళం పేరుతో జరుగున్న టీడీపీ, బీజేపీ, జనసేనల తొలి ఉమ్మడి సభ ఏర్పాట్ల విషయమై శనివారం టీడీపీ సీనియర్ నాయకులు ఏవీ సుబ్బారెడ్డి, నరసారావుపేట ఎంపీ అభ్యర్థి కృష్ణదేవరాయలు, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావులతో సమావేశం నిర్వహించారు. అనంతరం సభాస్థలికి వెళ్లి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఏవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలిరానున్న నేపథ్యంలో ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

'సభను జయప్రదం చేయాలి'

నంద్యాల (నూనెపల్లె), మార్చి 16: గుంటూరు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలో ఆదివారం జరిగే ప్రజాగళం భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, జనసేన పార్టీ నంద్యాల సమన్వయకర్త విశ్వనాథ్ పిలుపునిచ్చారు. శనివారం నంద్యాలలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నరేంద్రమోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు హాజరు కానున్నడంతో ప్రజాగళం సభకు ప్రత్యేక సంతరించుకుందని చెప్పారు. ఈ సభ జరుగుతున్న నేపథ్యంలో జగన్‌కు వెన్నులో వణుకుపుడుతుందని అన్నారు. సమావేశంలో జనసేన నాయకులు పిడతల సుధాకర్, పబ్బతి రవి, సాయిజయంత్, సందీప్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీని తరిమేందుకు ప్రజలు సిద్ధం'

ఆత్మకూరు, మార్చి 16: వైసీపీని తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ ఆత్మకూరు మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా అన్నారు. శనివారం ఎన్నికల షెడ్యూల్‌ను స్వాగతిస్తూ ఆ పార్టీ నాయకులు స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద టపాసులు కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌తో రాష్ట్రానికి స్వాతంత్ర్యం వచ్చినట్లు ఉందన్నారు. ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనతో ప్రజలందరు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. కనీసం వైసీపీ చేస్తున్న దుర్మార్గాలను ప్రజలు సైతం ప్రశ్నించలేని స్థితిలో అవస్థలు పడ్డారని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నాగూర్‌ఖాన్, రామ్మూర్తి, లింగస్వామిగౌడ్, మల్లేశ్వరరెడ్డి, సుబ్బరాజు, రవీంద్రబాబు, మోహన్, సతీష్, శివశంకరశర్మ, ఫక్రుద్దీన్, మల్లికార్జునరెడ్డి, మున్నా, నాగేశ్వరరావునాయక్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల షెడ్యూల్‌ను వీక్షించిన నాయకులు

ఆత్మకూరు, మార్చి 16: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన సార్వత్రిక ఎన్నికల నగరా ఎట్టకేలకు మోగింది. కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు శనివారం మధ్యాహ్నం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో శ్రీశైలం నియోజకవర్గంలో నాయకులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే ఆయా మండలాల్లోని నాయకులను ప్రసన్నం చేసుకుందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఎన్నికల షెడ్యూల్‌ను శ్రీశైలం నియోజకవర్గంలోని నాయకులు టీవీలకు అతుక్కుపోయి ఆసక్తిగా తిలకించడం గమనార్హం.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ



పాఠశాలను తనిఖీ చేస్తున్న విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి

నంద్యాల (నూనెపల్లె), మార్చి 16: రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ నంద్యాలలోని పలు మున్సిపల్ ప్రాథమిక, మున్సిపల్ ఉన్నత పాఠశాలలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లోని రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులను రాబట్టేందుకు ప్రయత్నించారు. జవాబులు చెప్పేందుకు విద్యార్థులు తడుము కోవడంతో సంబంధింత తరగతి ఉపాధ్యాయులపై ఆయన సీరియస్ అయ్యారు. జీతాలు తీసుకోవడం కాదు.. తీసుకున్న జీతానికి న్యాయం చేసేలా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సున్నితంగా హెచ్చరించారు. నంద్యాల పట్టణంలోని నూనెపల్లెలో ఉన్న పొట్టి శ్రీరాములు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్‌లో ఆయన విద్యార్థులను అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పకపోవడంపై తీవ్ర అసంతృప్తి, అసహనం వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా డీఈవో సుధాకర్‌రెడ్డితో పాటు అక్కడ ఉన్న డిప్యూటీ ఈవో మహబూబ్ బేగ్, ఎంఈవో బ్రహ్మపై కూడా అసహనం వ్యక్తం చేశారు. అధికారితో పాటు పాఠశాలల ఆర్‌జేడీ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర సాయుధ బలగాల కవాతు

ఆత్మకూరు, మార్చి 16: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శనివారం ఆత్మకూరు పట్టణంలో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించారు. బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ పంగజ్ కుమార్ నేతృత్వంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి వెంగళరెడ్డినగర్, అర్బన్‌కాలనీ, తోటగేరి, పెద్దబజారు, ఎస్సీబీపాలెం, ఏబీఎంపాలెం, కిషన్‌సింగ్ వీధి, కేజీరోడ్డు మీదుగా బీఎస్ఎఫ్ జవాన్లు కవాతు నిర్వహించారు. ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో ప్రజలందరు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకుకోవాలని సూచించారు. ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి, స్థానిక పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

నంద్యాల (కల్చరల్), మార్చి 16: నంద్యాలలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంజీవనగర్ కూడలిలో వున్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి నాగమహేష్, నంద్యాల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు భవనాశి శ్రీనివాస, జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బింగుమళ్ల శ్యామ్ సుందర్ గుప్తా, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర పొలిటికల్ వైస్ ఛైర్మన్ కండె శ్యామ్‌సుందర్‌లాల్, ఆర్యవైశ్య సంఘం నాయకులు బైసాని రామశేషు, కొత్తసుబ్బయ్య, బీజేపీ చంద్రశేఖర్, డాక్టర్ గెలివి సహదేవుడు, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు. నాయకులు పాల్గొన్నారు.

● **నంద్యాల (కల్చరల్/రూరల్):** నంద్యాల పింగళిసూరన స్మారక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఇన్‌చార్జి శ్రీధర్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను పురస్కరించుకొని పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నందనం క్లబ్ సభ్యులు బి. నాగేంద్ర, కె. వేణుగోపాల్, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల క్రైం: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం అవోపా అధ్యక్షుడు వీజీకే మూర్తి ఆధ్వర్యంలో నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆయన చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఆస్పత్రిలోని 200మంది రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. లయన్ పెలస శ్రీకాంత్, అవోపా జిల్లా అధ్యక్షుడు ఆత్మకూరు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి రామకృష్ణ, ఉమామహేశ్వర్,



నంద్యాలలో పొట్టి శ్రీరాముల విగ్రహం వద్ద నివాళి

మధుసూదన్, సాగర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మంటపంలో శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆ సంఘం నాయకులు పువ్వాడి భాస్కర్, శేగు కిరణ్‌కుమార్, జక్కా మురళీ, ఈపూరి శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగూ ఆత్మకూరు మున్సిపాలిటీ కార్యాలయంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

మహానంది: మహానంది సమీపంలోని దేవస్థానం సిబ్బంది కాలనీలో ఒక ఫంక్షన్ హాలులో జిల్లా ఆర్య వైశ్య ప్రముఖులు పొట్టి శ్రీరాములు జయంతిని నిర్రవహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు భవనాశి వెంకట రమణయ్య, జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు భవనాశి మంజులవాణి తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: వెలుగోడు పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆర్యవైశ్య నాయకులు బళ్ళాని వెంకట సత్యనారాయణ, బచ్చు రాము, నాగేశ్వ సుబ్రమణ్యం, సింహాద్రి ప్రసాద్ గుప్తా, మెడికల్ రాము, సురేశ్, సంపత్, రవికుమార్ పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను నందికొట్కూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శనివారం శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద మున్సిపల్ కమీషనర్ సుధాకర్‌రెడ్డి, పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య, పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు సురేంద్రనాథ్‌రెడ్డి, ముర్తుజావళి, షకీల్ అహ్మద్, జాకీర్, నిమ్మకాల రాజు, రాజన్న, జమీల్, కళాకర్, సొదీ చాంద్, నిమ్మకాయల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

● మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దార సుధీర్‌లు క్షీరాషేకం చేసి, పూలమాల వేసి నివాళి అర్పించారు.

జగజ్జననీదేవి ఆలయ వార్షికోత్సవం ప్రారంభం



కలశాలలో అమ్మవారికి నీటిని తీసుకెళ్తున్న భక్తులు

నంద్యాల (కల్చరల్), మార్చి 16: నంద్యాల జగజ్జననీ నగర్‌లో వెలసిన జగజ్జననీదేవి ఆలయ పంచదశ వార్షికోత్సవాన్ని దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణాలు, మంటప పూజలు, కలశస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఉదయం 6 గంటల నుంచి తమ ఇంటి వద్ద నుంచి కలశాలతో నీరు తీసుకొని అమ్మవారి సన్నిధికి చేరుకుని అమ్మవారికి జలాభిషేకం చేశారు. అనంతరం మహా మంగళ హారతి కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన దీక్షా హోమం, ప్రదోషపూజా కార్యక్రమాలు నిర్వహించారు. దత్తాత్రేయ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది భక్తులు పాల్గొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు కూడా వచ్చి అమ్మవారిని దర్శనం చేసుకుని శ్రీచక్ర పూజలు, కుంకుమార్చనలు చేశారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కొత్తపల్లి, మార్చి 16: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కొత్తపల్లి, గోకవరం పరీక్ష కేంద్రాల చీఫ్ ఎగ్జామినర్లు ఇబ్రహీం, రఘుస్వామిలు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ కొత్తపల్లి సెంటరులో మొత్తం 240 మంది విద్యార్థులు హాజరవుతుండగా.. అందులో 156 మంది రెగ్యులర్ కాగా, 84 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నట్లు చెప్పారు. అలాగే గోకవరం పరీక్ష కేంద్రానికి మొత్తం 130 మంది విద్యార్థులు హాజరవుతుండగా.. అందులో 85 మంది రెగ్యులర్ కాగా, 45 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారన్నారు. ప్రతి రోజు ఉదయం 9.30గంటలకు పరీక్షలు ప్రారంభమై.. 12.45 గంటలకు ముగుస్తాయనీ చెప్పారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక వైద్యశిబిరం, తాగునీరు, పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు టేబుళ్లు, ఫ్యాన్లు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్లు తదితర సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లాలోని పదో తరగతి పరీక్షలకు సంబంధించి మూడు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో చిన్నమద్దిలేటి తెలిపారు. రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు మొత్తం 593 మంది పదీ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మోడల్ స్కూల్‌లో 235, గురుకుల పాఠశాలలో 173, ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 185 మంది విద్యార్థులను పరీక్షరాసేందుకు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

'పకడ్బందీగా అమలు చేయాలి'



సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ శివకుమార్‌రెడ్డి

బండిఆత్మకూరు, మార్చి 16: సార్వత్రిక ఎన్నికల నియమావళిని సిబ్బంది క్షేత్రస్థాయిలో పగడ్బందీగా అమలు చేయాలని నంద్యాల రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి సూచించారు. శనివారం బండిఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎన్నికల అధికారులతో కలసి సమర్థవంతంగా విధులు నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యం తగదని అన్నారు. సమావేశంలో ఎస్ఐ మల్లికార్జున, ఏఎస్ఐ అక్బర్, సిబ్బంది పాల్గొన్నారు.

'గొడవలకు పాల్పడితే చర్యలు'

కొత్తపల్లి, మార్చి 16: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషణ్ హెచ్చరించారు. మండలంలోని కొత్తపల్లి, లింగాపురం, శివపురం గ్రామాల్లో స్థానిక ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం సీఐ నాగభూషణ్, డీఎస్ఎఫ్ సెంట్రల్ ఫోర్స్ బలగాలతో కవాత్తు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల ప్రధాన కూడళ్లలో సీఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ముఖ్యంగా ఎన్నికల ప్రవర్తన నియామవలి గురించి ప్రజలకు వివరించారు. ప్రజలు ఏ రాజకీయ పార్టీలకు భయపడకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రశాంత వాతావరణం కల్పించడమే పోలీసుల ముఖ్య ఉద్దేశమని చెప్పారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే.. ఎంతటివారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని సీఐ హెచ్చరించారు.

ముగిసిన సదస్సు

పాణ్యం, మార్చి 16: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో రెండురోజులుగా ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రవాహ 2024 జాతీయ సాంకేతిక సదస్సు శనివారం ముగిసింది. ఈ సదస్సులో వివిధ జిల్లాల్లోని ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 193 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు కన్వీనర్ డాక్టర్ నాగభాస్కరరెడ్డి తెలిపారు. ఈ సదస్సులో 69 మంది సాంకేతిక పత్రికలు ప్రదర్శించినట్లు తెలిపారు. ప్రాజెక్టు ఎగ్జిబిషన్‌లో 38 మంది, పోస్టర్ ప్రజంటేషన్‌లో 39 మంది, కోడింగ్ కాంపిటీషన్‌లో 116 మంది, 13 స్టాల్స్, సాంకేతిక ప్రదర్శనలో 6 మంది పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విజేతలకు గుంతకల్లు డివిజన్ సీనియర్ రైల్వే మేనేజరు విజయచంద్రాచారి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ రామిరెడ్డి, డాక్టర్ లెనిన్, విజయసురేష్, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలి: ఎస్టీయూ

నంద్యాల (నూనెపల్లె), మార్చి 16: నంద్యాలలోని టెక్కె, నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు మౌళాలి డిమాండ్ చేశారు. శనివారం నంద్యాలలోని ట్రెజరీ కార్యాలయంలో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల విలీన ప్రక్రియలో భాగంగా మున్సిపల్ శాఖ నుంచి విద్యాశాఖలోకి మారిందని, అయితే క్యాడర్ స్ట్రెంత్‌లో దొర్లిన తప్పిదాల కారణంగా కొంత మంది మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులకు జీతాలు నిలిచిపోయాయని చెప్పారు. ఎస్టీయూ రాష్ట్ర సాంకేతిక కమిటీ కన్వీనర్ నాగేంద్రకుమార్, మున్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రైతు సంక్షేమమే ధ్యేయం'

కొత్తపల్లి, మార్చి 16: రైతుల సంక్షేమమే వైసీపీ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అన్నారు. శనివారం బైరెడ్డి కొత్తపల్లిలో రూ.1.10 కోట్లతో నిర్మించిన రెండు గోదాములను నందికొట్కూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త దారా సుధీర్, నాగంపల్లి సింగిల్ విండో ఛైర్మన్ గౌరు జనార్దన్ రెడ్డి, సీఈవో కోటితో కలిసి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సిద్దార్థరెడ్డి మాట్లాడుతూ ఇక నుంచి రైతులు గోదాములలో వారు పండించిన ధాన్యాన్ని నిల్వ ఉంచుకుని మద్దతు ధర ఉన్నప్పుడు విక్రయించుకోవచ్చని తెలిపారు. జడ్పీటీసీ సోముల సుధాకర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు కిచ్చెన్నగారి సుధాకర్ రెడ్డి, నాయకులు సింగారపు వెంకటరమణ, నారాయణరెడ్డి, మహ్మద్ గౌస్, మహబూబ్ బాషా, నాగాలక్ష్మిరెడ్డి, నాగ ఎల్లయ్య, సర్పంచులు మారెల్ల, బాల ఎల్లయ్య, మాశమ్మ, ఎంపీటీసీలు స్రవంతి, బాల్‌రాజు, అల్లీబాషా, శివన్న, తదితరులు పాల్గొన్నారు.

'బాలికా విద్యను ప్రోత్సహించాలి'



కొత్తపల్లిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి, మార్చి 16: బాలికా విద్యను ప్రోత్సహించాలని కొత్తపల్లి ఎంఈవో శ్రీరాములు విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. శనివారం కొత్తపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులతో కలిసి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా హైస్కూల్ నుంచి బస్టాండు సెంటరు వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించిన అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈవో-2 ఐదయతుల్లా, హెచ్ఎం రామస్వామి, ఉపాధ్యాయులు రాంబాబు, మక్బుల్‌బాషా, బాలాంజనేయులు, మహిళా పోలీసు భారతి, ఏఎన్ఎం జ్యోతి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

నంద్యాల (కల్చరల్), మార్చి 16: నంద్యాల అభిరుచి సేవాసమితి వ్యవస్థాపకుడు, బీజేపీ నంద్యాల కన్వీనర్ అభిరుచి మధు ఆధ్వర్యంలో శనివారం చీరలు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 30 వేల మందికి పైగా మహిళలకు చీరలు పంపిణీ చేశామని మధు తెలిపారు. నంద్యాల పట్టణంలోని దేవనగర్, విశ్వనగర్, నూనెపల్లి, సాదిక్‌నగర్, ఏకలవ్య నగర్‌లో పంపిణీ చేశారు. నంద్యాల రూరల్ అధ్యక్షుడు గుర్రబ్రహ్మ, గోస్పాడు మండల అధ్యక్షుడు మధుగోపాల్, బీజేపీ సీనియర్ నాయకులు కొల్లి రామ సుబ్బారెడ్డి, నరసయ్య యాదవ్, మైనారిటీ నాయకురాలు హసీనా, నాగేంద్ర ప్రశాంత్ తదితరులు అభిరుచి సేవా సమితి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

'అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ'

పాణ్యం, మార్చి 16: అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ సాధ్యమని నంద్యాల సైబర్ సెక్యూరిటీ సీఐ సీఎం రాకేష్ తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణ పై సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచికి మాత్రమే ఉపయోగించాలని సూచించారు. నంద్యాల జిల్లాలో రోజుకు వంద సైబర్ మోసాల కేసులు నమోదవుతున్నాయని చెప్పారు. సెల్ ఫోన్‌లో ఉద్యోగాలు ఇస్తామని, ఎక్కువ లాభాలు పొందే పెట్టుబడి పెట్టాలని, తక్కువ ధరకు వస్తువులు పొందవచ్చన్న ప్రకటనలతో ఎక్కువ మోసపోతున్నారన్నారు. ఆధార్, ఓటీపీ నెంబరు చెప్పాలని ఇతరులు కోరినా చెప్పకూడదని, ఆధార్‌ను లాక్ చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల బాధితులు 1930 టోల్‌ఫ్రీ నెంబరుకు వెంటనే సమాచారం అందించాలన్నారు. ఫొటో మార్ఫింగ్‌లతో బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ డాక్టర్ భాస్కర రావు, డాక్టర్ రంగస్వామి, ఐఎస్‌టీఈ అడ్వైజర్ అన్నపూర్ణ, సైబర్ సెక్యూరిటీ సిబ్బంది సుబ్బరాయుడు, ఈశ్వర్, నీరజ, రఘు పాల్గొన్నారు.

అలరించిన సంప్రదాయ నృత్యం



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, మార్చి 16: నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా దేవస్థానం శనివారం సాయంత్రం సాయి సురేఖ డాన్స్ అకాడమీ, విశాఖపట్నం బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గణపతిస్తుతి, శివాష్టకం, శివపార్వతీ కల్యాణం, దేవీస్తుతి, భో..శంభో తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

జూపాడుబంగ్లాలో అగ్ని ప్రమాదం

జూపాడుబంగ్లా, మార్చి 16: జూపాడుబంగ్లాలోని విద్యుత్ ఉప కేంద్రం సమీపంలో ఉన్న మొక్కలను పెంచే నర్సరీ వద్ద మొక్కలు పెంచే ప్లేట్లు కాలిపోయాయి. కేజీ రోడ్డు పక్కనే ఉండటంతో పొగకమ్ముకుపోయింది. విద్యుత్ తీగలు కూడా మంటలపైన ఉండటంతో అధికారులు అరగంట పాటు సరఫరాను నిలిపివేశారు. స్థానికులు వెంటనే మంటలను అదుపుచేయడంతో ఘోర ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు.

'ఎన్నికల సమాచారాన్ని మీడియాకు చేరవేయాలి'



డీపీఆర్వోకు ఎన్నికల గురించి వివరిస్తున్న కలెక్టర్

నంద్యాల (కల్చరల్), మార్చి 16: సాధారణ ఎన్నికలు-2024 ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు చేరవేయాలని కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు డీపీఆర్వోను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల మీడియా సెంటర్, కమాండ్ కంట్రోల్ రూమ్, కంప్లైంట్ సెల్ తదితర విభాగాలను డీఆర్వో పద్మజతో కలిసి పర్యవేక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియ మావళిపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే నమోదు చేసుకొని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం కలెక్టర్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు.

● దేశవ్యాప్తంగా సాధారణ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె.శ్రీనివాసులు వెల్లడించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎన్నికల ప్రవర్తన నియమావళి తక్షణ అమలుపై కలెక్టర్ మీడియా వాయిస్ ద్వారా సమాచారం ఇచ్చారు. జిల్లాలో మొత్తం 19,15,235 మంది జనాభాలో 13,76,564 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఇందులో 6,74,362 మంది పురుషులు, 7,01,979 మంది స్త్రీలు, 253 మంది ఇతరులు, 2806 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ వెల్లడించారు. 24 గంటల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో ఉన్న రాజకీయ నాయకుల చిత్రపటాలు, పోస్టర్లు, బ్యానర్లు,తొలగించాలని చెప్పారు. 48గంటల్లో బస్సులపై, బస్‌స్టేషన్లలో, పబ్లిక్ ప్రదేశాల్లో ఉన్న అనధికార రాజకీయ పరమైన ప్రకటనలు, ఇతర చిత్రాలను తొలగించాలన్నారు. ప్రభుత్వ వెబ్‌సైట్లలో ఉన్న రాజకీయపరమైన ఫొటోలను కూడా తొలగించాల్సి ఉంటుందని తెలిపారు.

ట్రాఫిక్ పోలీసులకు కిట్ల పంపిణీ



కిట్లను అందజేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం, మార్చి 16: నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి పట్టణంలో విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులకు ఎండవేడిమి నుంచి రక్షణ కల్పించే పర్సనల్ కిట్లను అందించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కాత్యాయిని మెడికల్స్ అండ్ సర్జికల్స్, సెవెన్ హిల్స్ హాస్పిటల్ ఎండీ రెంటల మారుతీకుమార్ సహకారంతో టోపీలు, చలువ కళ్లద్దాలను ఎస్పీ ట్రాఫిక్ పోలీసులకు అందజేశారు. దాత అందజేసిన కిట్స్‌ను ఎస్పీ ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్‌కు అందజేసి సిబ్బందికి అందజేయాలని సూచించారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం




ఆత్మకూరులో లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, మార్చి 16: ఆత్మకూరు కోర్టు ఆవరణం నందు శనివారం నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్‌లో 32 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.ఆయన మాట్లఆడుతూ ఆత్మకూరు సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిల కోర్టుల పరిధిలో మొత్తం 32 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. ఇందులో క్రిమినల్ కేసులు 20, సివిల్ కేసులు 10, మెయింటినెన్స్ కేసు 1, ప్రీ లిటికేషన్ కేసు 1 చొప్పున పరిష్కరించినట్లు తెలిపారు. జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఆదినారాయణ, న్యాయవాదులు సుధాకరరెడ్డి, సుదర్శన్, బలరామ్‌నాయక్, మాణిక్యరావు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

నందికొట్కూరు: జాతీయ లోక్‌అదాలత్‌లో 44 కేసులు పరిష్కారం అయ్యాయని నందికొట్కూరు సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని తెలిపారు. శనివారం నందికొట్కూరు కోర్టు ఆవరణో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ రకాల కేసులలో 44 కేసులను పరిష్కరించారు. కేసులకు సంబంధించి రూ.8,48,510 ని కోర్టు జరిమానా విధించారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న మాదిగ న్యాయవాదుల అసోసియేషన్ నాయకులు

నంద్యాల క్రైం, మార్చి 16: బహుజన సమాజ్‌వాది పార్టీ (బీఎస్పీ) వ్యవస్థాపకుడు దివంగత కాన్షీరామ్‌కు మాదిగ అడ్వకేట్స్ అసోసియేషన్ (మా) ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. నంద్యాలలోని సీనియర్ న్యాయవాది ఎం.వెంకటేశ్వరుడు కార్యాలయంలో శనివారం మాదిగ న్యాయవాదుల అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. కాన్షీరామ్ 90వ జయంతి వారోత్సవాల్లో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. గౌరవాధ్యక్షుడు జి.శ్రీనివాసులు, అధ్య క్షుడు ఎం.వెంకటేశ్వరుడు, కార్యదర్శి కె.పుల్లన్న, సహాయ కార్యదర్శి వనం శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు జీవన్‌రాజ్, కోశాధికారి సుబ్బలక్ష్మి, న్యాయవాదులు వి.రామచంద్రుడు, సి.సుధాకర్, బి.శ్రీనివాసులు, జగదీష్ పాల్గొన్నారు.

ముగిసిన గురు వైభవోత్సవాలు

- ఘనంగా రాఘవేంద్రస్వామి 429వ పుట్టిన రోజు వేడుకలు
- నవరత్నాల రథంపై స్వామివారు
- టీటీడీ నుంచి పట్టువస్త్రాలు
- 350 మంది విద్వాంసులచే సంగీత కార్యక్రమం
- రాఘవరాయలకు పుష్పాలంకరణ


నవరత్నాల రథంపై ఊరేగుతున్న రాఘవేంద్రుడు

మంత్రాలయం, మార్చి 16: మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాలు ముగిశాయి. శనివారం రాఘవేంద్రస్వామి 429వ పుట్టిన రోజు వేడుకలు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి జీఈవో వీరబ్రహ్మం అధికారికంగా పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. అనంతరం రాఘవేంద్ర స్వామిని వైభవంగా ఊరేగించారు. ఆ తర్వాత ఊంజల మండపంలో వెండి సింహాసనంపై రజిత రాఘవేంద్ర స్వామి కవచాన్ని ఉంచి వెండి వీణకు ప్రత్యేక అభిషేకాలు, హారతులు చేశారు. రాఘవరాయలను వివిధ రకాల పుష్పాలతో శోభాయామానంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ పండిత కేసరి రాజా ఎస్ గిరిరాజాచార్, మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, బీఎం ఆనందరావు, వాదిరాజాచార్, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, సూపరింటెండెంట్లు రవికులకర్ణి, అనంతపురాణిక్, విజేంద్రాచార్, ద్వారపాలక అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తులను ఆకట్టుకున్న భరత నాట్యం

గురు వైభవోత్సవాల్లో చివరి రోజు రాఘవేంద్రస్వామి 429వ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని శనివారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో బెంగళూరుకు చెందిన నాట్య బృందం చేసిన భరతనాట్యం భక్తులను అలరించింది. బెంగళూరుకు చెందిన చంద్రిక గురురాజ్ వారి దాసవాణి సాహిత్యం భక్తులను కనువిందు చేసింది.

ప్రముఖులకు అవార్డుల ప్రదానం

మంత్రాలయం, మార్చి 16. మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురువైభవోత్సవాల్లో ముగింపు రోజు రాఘవేద్రస్వామి 429వ పుట్టిన రోజును పురస్కరించుకుని శనివారం రాత్రి యోగీంద్ర కళామంటపంలో ప్రముఖులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు అవార్డులను ప్రదానం చేశారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ నూనెపల్లె, ఆర్అండ్బీ ప్రిన్సిపాల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న, కర్ణాటక హైకోర్టు అడిషనల్ జనరల్ శాంతి భూషణ్, బెంగుళూరు, రాయచూరు సీనియర్ న్యాయవాదులు ఎస్పీ శంకర్, ఎస్కే పురోహిత్, చెన్నైకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రమోద్లకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్జోషి, ఆర్అండ్బీ ఎస్ఈలు నాగరాజు, హరిప్రసాద్, ఈఈ కృష్ణారెడ్డి, డీఈ నాగరాజు, ఆర్డీఓలు నాగేంద్ర, సుధాకర్రడ్డి, శశిరదీప్తి, రమేష్, బాబు కిషోర్, ఎస్ఐ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.


టీటీడీ పట్టువస్త్రాలను తలపై మోసుకుని వస్తున్న పీఠాధిపతి


రాఘవేంద్ర స్వామి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న భక్తులు


టీటీడీ పట్టువస్త్రాలను బృందావనం ముందు ఉంచి పూజలు చేస్తున్న పీఠాధిపతి


ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ హరినాథ్కు అవార్డు అందజేస్తున్న పీఠాధిపతి

దారి దోపిడీ

- నల్లమల ఘాట్లో రెండు లారీలను అటకాయించిన దుండగులు
- డ్రైవర్లను కిడ్నాప్ చేసి మిరప బస్తాలను తీసుకెళ్లిన వైనం


దోపిడీకి గురైన లారీలు

పాణ్యం, మార్చి 16: మిరప లోడుతో వెళ్లిన రెండు లారీలను గుర్తు తెలియని వ్యక్తులు అటకాయించి దారి దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటన శనివారం పాణ్యం మండలంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా... పాణ్యం మండలం తొగర్చేడు గ్రామానికి చెందిన కాశిరెడ్డి మహేంద్రారెడ్డి 25 ఎకరాల్లో మిరప పంట సాగు చేశాడు. శనివారం ఉదయం 8 గంటలకు దాదాపు రూ.30 లక్షల విలువ చేసే పంటను రెండు లారీల్లో గుంటూరుకు తరలించాడు. లారీల వెంట డ్రైవర్లతోపాటు కమీషన్ వ్యాపారి షరీఫ్ కూడా వెళ్లాడు. 11 గంటలకు శిరివెళ్ల మండలం పచ్చర్ల దాటిన తర్వాత చింతమాను టర్నింగ్ వద్ద మూడు వాహనాల్లో గుర్తు తెలియని 20 మంది వ్యక్తులు లారీలను అటకాయించారు. లారీ డ్రైవర్లు నరసింహ, శేఖర్, కమీషన్ వ్యాపారిని కొట్టి కళ్లకు గంతలు కట్టారు. అనంతరం వారి వద్ద ఉన్న సెల్ఫోన్లు లాక్కొని స్విచ్ఛాఫ్ చేశారు. వారిని తమ వాహనాల్లో ఎక్కించుకొని తీసుకువెళ్లారు. లారీలను మరికొంతమంది ఆగంతకులు తీసుకువెళ్లారు. డ్రైవర్లు, కమీషన్ ఏజెంట్ను తొమ్మిది గంటలు తమ వాహనాలలో తిప్పుతూ రాత్రి 8 గంటల సమయంలో పాణ్యం సమీపంలోని ఎస్సార్బీసీ కెనాల్ వద్ద హైవే పక్కన లారీలతో పాటు వదిలేసి వెళ్లిపోయారు. దీంతో డ్రైవర్లు సమాచారాన్ని తమ కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు పాణ్యం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అప్పటికే రైతు మహేంద్రారెడ్డి పాణ్యం ఎస్ఐ అశోక్కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి లారీలను పోలీసు స్టేషన్కు తరలించారు. బాధితులను సీఐ నల్లప్ప విచారించారు. పూర్తి సమాచారం తెలుసుకుని కేసు నమోదు చేస్తామని ఆయన వెల్లడించారు.


కిడ్నాపైన డ్రైవర్లు

గాయత్రి హాస్పిటల్ యాజమాన్యంపై కేసు నమోదు

కర్నూలు, మార్చి 16: నగరంలో నాలుగో పట్టణ పోలీస్స్టేషన్ పరిధిలో కొత్తబస్టాండు దగ్గర ఉన్న గాయత్రి హాస్పిటల్ యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ శంకరయ్య తెలిపారు. ఆసరా జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆసుపత్రి ఎండీ జిలాని, జ్యోతి డయోగ్నస్టిక్ సెంటర్ మేనేజర్ కిరణ్ కుమార్లపై కేసు నమోదు చేశామన్నారు. ఆసరా హెల్త్ స్కీం కింద పక్షవాతం, తదితర వ్యాధులు వచ్చే బాధితులకు ప్రభుత్వం రోగుల కోసం రూ.30వేలు, వైద్యం ఇచ్చేందుకు ఆసుపత్రికి రూ.20వేల చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ నేపథ్యంలో కొంత కాలంగా గాయత్రీ ఆసుపత్రి నుంచి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పక్షవాతం కేసులు అధికంగా నమోదయ్యాయి. ఈ కేసుల కోసం ప్రభుత్వం రూ.5.5 కోట్ల నిధులు యాజమాన్యానికి చెల్లించింది. ఇలా పెద్ద ఎత్తున కేసులు రావడంతో అనుమానం వచ్చిన ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఈ విచారణలో దాదాపు కేసులన్నీ బోగస్ అని తేలింది. ఈ నేపథ్యంలో ఆసరా కోఆర్డినేటర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మంత్రాలయం టికెట్పై పునరాలోచించాలి

- కోసిగిలో టీడీపీ శ్రేణుల భారీ ర్యాలీ
- ప్రజాభీష్టం మేరకే బరిలో ఉంటా
- మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి


కోసిగిలో టీడీపీ శ్రేణుల భారీ ర్యాలీ

కోసిగి, మార్చి 16: మంత్రాలయం టీడీపీ టికెట్పై టీడీపీ అధిష్ఠానం పునరాలోచించాలని నియోజకవర్గ ఇన్చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి అధినేత చంద్రబాబును విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం మంత్రాలయం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు కోసిగిలోని మార్కండేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి అక్కడి నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. కోసిగిలోని రేణుకా ఎల్లమ్మ మైదానం వరకు కొనసాగిన ర్యాలీలో తిక్కారెడ్డి కూడా పాల్గొన్నారు. చంద్రబాబు, లోకేశ్లు మరోసారి పునరాలోచించి మంత్రాలయం టీడీపీ టికెట్ తనకే కేటాయించాలని తిక్కారెడ్డి కోరారు. తానేమి తప్పు చేశానని టికెట్ ఇవ్వలేదని ప్రశ్నించారు. రెండు నెలల ముందు వరకు వైసీపీలో ఉన్న మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కోవర్టులకు టీడీపీ టికెట్ కేటాయించడం సబబు కాదన్నారు. టీడీపీ టికెట్ రాఘవేంద్రరెడ్డికి వస్తుందని మూడు నెలలకు ముందే వైసీపీ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చెప్పాడన్న విషయాన్ని తిక్కారెడ్డి గుర్తు చేశారు. అనంతరం రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో తిక్కారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, కోసిగి మండల కన్వీనర్ జ్ఞానేష్, నాయకులు రమాకాంత్ రెడ్డి, అయ్యన్న, వీరారెడ్డి, భరద్వాజశెట్టి, ఈరన్న, వెంకటేశ్ స్వామి, అమర్నాథ్ రెడ్డి, కోట్రేష్గౌడు, నరసమ్మ, సరోజ, శకుంతల తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న తిక్కారెడ్డి

క్యాన్సర్ హాస్పిటల్ పోస్టుల ఫైనల్ లిస్టు విడుదల

కర్నూలు(హాస్పిటల్), మార్చి 16: కొత్తగా ఏర్పాటు అయిన స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్కు సంబంధించిన 3 కేటగిరి అభ్యర్థుల ఫైనల్ మెరిట్ లిస్టు, ఫైనల్ సెలక్షన్ లిస్టును విడుదల చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. మూడు కేటగిరి అభ్యర్థుల లిస్టును కర్నూలు ప్రభుత్వ వెబ్సైట్ Https:kurnool.ap.gov.in నంద్యాల జిల్లా ప్రభుత్వ వెబ్సైట్ Https:nandyal.ap.gov.in మరియు కర్నూలు మెడికల్ కాలేజీ వెబ్సైట్ Https:kurnoolmedicalcollege.ac.in లో అప్లోడు చేసినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ ఉదయం 10.30 గంటలకు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో జరిగే కౌన్సిలింగ్కు హాజరు కావాలని కోరారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ వరకు సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్కు హాజరు కావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

సి. బెళగల్, మార్చి 16: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. మండలంలోని తుంగభద్ర నది నుంచి తెలంగాణలోని తిమ్మిళ, మానుదొడ్డి, పెద్దదన్వాడ గ్రామాలకు చెందిన ఐదు ట్రాక్టర్లు శనివారం ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. మాలెసోమాపురం, తిమ్మనదొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, పల్దొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె, శింగవరం గ్రామాలలో నుంచి ఇసుకను తరలిస్తే వదిలే ప్రసక్తి లేదన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నాగన్న, హెడ్ కానిస్టేబులు, పోలీసలు ఉన్నారు.

ఎగువ అహోబిలంలో ధ్వజారోహణ

ఆళ్లగడ్డ, మార్చి 16: ఎగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం సింహవాహనంపై జ్వాలా నరసింహస్వామిపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ముందుగా బంగారు ధ్వజారోహణం చేశారు. దిగువ అహోబిలం శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు శనివారం అంకురార్పణ చేశారు. సకాలంలో వర్షాలు కురవాలని దేశం సుభిక్షంగా ఉండాలని, విశ్వక్సేణుడిని పుట్ట బంగారంతో చేసిన మంటపంలో పూజించారు.

నేడు ఎగువ అహోబిలంలో....

అహోబిలం బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి సూర్యప్రభ వాహనం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వేదపండితులు తెలిపారు.

'స్పందన' రద్దు

నంద్యాల (కల్చరల్), మార్చి 16: ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో తక్షణమే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని, ఈ మేరకు ప్రతి సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

అడిషనల్ డీఎంఈగా పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్), మార్చి 16: కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మకు అడిషినల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్గా పదోన్నతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాసుపత్రుల్లో ఆరుగురికి ప్యానల్లో ఏడీఎంఈగా పదోన్నతులు ఇచ్చారు. అందులో భాగంగా డాక్టర్ చిట్టినరసమ్మ రెగ్యులర్ ప్రిన్సిపాల్గా కొనసాగనున్నారు. ఈ నెల ఒకటో తేదీన ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా ఆమె బాధ్యతలు స్వీకరించగా, 16 రోజులకే ఏడీఎంఈతో పాటు రెగ్యులర్ ప్రిన్సిపాల్గా అవకాశం దక్కించుకున్నారు.

సెల్ఫోన్ కోసం దారుణం

- నానమ్మను చంపేసిన మనుమడు
- ఇంట్లోనే పాతిపెట్టి బంగారుతో ఉడాయింపు
- బంగారాన్ని విక్రయించి సెల్ఫోన్ కొనుగోలు
- రెండువారాల తర్వాత వెలుగులోకి
- కర్నూలు జిల్లా గోనెగండ్లలో అమానవీయ ఘటన


నాగమ్మ (ఫైల్)


వెంకటేష్

గోనెగండ్ల మర్చి 16: ప్రస్తుత సమాజంలో బంధాలు, బంధుత్వాలు రోజురోజుకూ తగ్గుతున్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట కట్టుకున్న వాడు, కావాల్సిన వాళ్లు, రక్తసంబంధీకులు దారుణాలకు ఒడిగడుతున్నారు. అదే కోవలోకే మరో ఘటన వచ్చి చేరింది. సెల్ఫోన్ కొనుగోలు చేసేందుకు డబ్బు లేకపోవడంతో సొంత నాన్నమ్మను హతమార్చి ఆమెపై బంగారాన్ని విక్రయించి మోజు తీర్చుకున్నాడు ఓ మనుమడు. అవ్వను హతమార్చి ఇంట్లోనే పాతిపెట్టిన సంఘటన గోనెగండ్ల మండలంలో శనివారం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా...

గోనెగండ్ల మండలంలోని పెద్దమరివీడు గ్రామానికి చెందిన కురువ నాగమ్మ(80)కు చిన్నబజారి, పెద్దబజారి అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు గ్రామంలో కూలీ పని చేసి జీవనం సాగించేవాడు. ఇతడికి భార్య పిల్లలు ఉన్నారు. చిన్న బజారి కర్నూలులో స్థిరపడ్డాడు. అయితే చిన్న బజరి పెద్దమరివీడులో సొంతింటిని నిర్మించి ఆ ఇంట్లో తన తల్లి నాగమ్మను ఉంచాడు. కురువ నాగమ్మ ఒంటరిగా ఆ ఇంట్లో జీవనం చేస్తుండేది. అయితే పెద్ద కుమారుడు పెద్ద బజారి గ్రామంలో కూలీ పనులు లేక పోవడంతో బతుకుదెరువు కోసం గుంటూరుకు భార్య, పిల్లలతో వలస వెళ్లాడు. వారి కుమారుడు వెంకటేష్ అక్కడ వ్యసనాలకు బానిసయ్యా డు. ఇదే సమయంలో వెంకటేష్కు కొత్త సెల్ఫోన్ కొనుగోలు చేయాలన్న కోరిక కలిగింది. డబ్బులు లేక పోవడంతో సెల్ కొనలేకపోయాడు. ఇందుకోసం ఓ పథకం వేశాడు. తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి పెద్ద మరివీడుకు వచ్చాడు. తన నానమ్మ నాగమ్మ దగ్గర ఉన్న బంగారాన్ని దొంగలించి ఆ డబ్బుతో ఖరీదైన సెల్ఫోన్ కొనుగోలు చేయాలని భావించాడు. అనుకున్నదే తడవుగా ఈ నెల నాలుగో తేదీన నానమ్మ నాగమ్మ ఉన్న ఇంటికి మనుమడు వెంకటేష్ సాయంత్రం వెళ్లాడు. అక్కడ నాగమ్మ గొంతు నులిమి హత్య చేశాడు. ఆమె శరీరంపై ఉన్న రెండున్నర తులాల బంగారు చైన్ను తీసుకున్నాడు. రాత్రి వరకు అక్కడే వేచి చూసి వీధిలో ఎవరూ తిరగని సమయంలో ఇంటి ఆవరణలో ఉన్న స్థలంలో గుంత తవ్వి అందులో పూడ్చివేశాడు. ఉదయం ఏమీ తెలియనట్లు ఎమ్మిగనూరుకు వెళ్లి అక్కడ ఓ దుకాణంలో దోచుకున్న బంగారును రూ.29 వేలకు విక్రయించాడు. వచ్చిన డబ్బు నుంచి రూ.25వేల పెట్టి కొత్త సెల్ఫోన్ కొన్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చి ఏమి తెలియనట్లు గుంటూరులోని తన తల్లిదండ్రులకు దగ్గరకు వెళ్లాడు. ఈ నెల 13 తేదీన నాగమ్మ చిన్నమనుమడు గోపాల్ గ్రామానికి వచ్చాడు. తన నానమ్మ నాగమ్మ ఇంట్లో లేకపోవడంతో ఎక్కడికి వెళ్లిందని విచారణ చేశాడు. ఇంటిపక్కన వీధిలో విచారణ చేసినప్పటికి నానమ్మ జాడ కనిపించలేదు. దీంతో అనుమానంతో అదే రోజు గోనెగండ్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు. పెద్దమనుమడు వెంకటేష్ వచ్చి వెళ్లిన తరువాత ఈ సంఘటన జరగడంతో పోలీసులకు అనుమానం కలిగింది. తమదైన శైలిలో వెంకటేష్ను విచారించగా వాస్తవం బయటపడింది. శనివారం ట్రైనీ డీఎస్పీ భావన, గోనెగండ్ల సీఐ, పోలీసులు, వైద్యులు, తహసీల్దార్ సమక్షంలో 13 రోజుల తరువాత మృతురాలి శవాన్ని వెలికితీశారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని వెంకటేష్ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

● తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

డోన్(రూరల్), మార్చి 16: వస్తువుల కొనుగోళ్లలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని డోన్ తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వినియోగదారుల రక్షణ సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను తహసీల్దార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువుల కొనుగోళ్లలో వినియోగదారులు ఏదైనా నష్టం జరిగినట్లు భావిస్తే వినియోగదారుడు కోర్టు ద్వారా న్యాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షులు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు ఏఈ నాగరాజు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కాలనీల్లో ప్రజల బాధలు పట్టవా...?

డోన్, మార్చి 16: పట్టణంలోని శివారు కాలనీల్లో కనీస వసతులు లేక ప్రజలు పడుతున్న బాధలు మంత్రి బుగ్గనకు కనిపించవా అని డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత అన్నారు. శనివారం పట్టణ సమీపంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి, వైఎస్ నగర్‌లలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కోట్ల నివేదిత మాట్లాడుతూ మంత్రి బుగ్గన డోన్‌ను అభివృద్ధి చేశానంటూ గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేక ప్రజలు పడుతున్న అవస్థలు చూస్తే ఏమి అభివృద్ధి చేశారో మంత్రికే తెలుస్తుందన్నారు. మెయిన్ రోడ్లకు సోకులు చేయడం కాదని, వీధుల్లో వచ్చి చూస్తే ప్రజలకు కనీస వసతులు లేవన్న విషయం మంత్రికి అర్థమవుతుందన్నారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గెలిచిన తర్వాత కాలనీల్లో ప్రజలకు వసతులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, మర్రిరమణ, భాస్కర్ నాయుడు, ఎస్ఎండీ రఫి, ఓంప్రకాష్, బాష్యం శ్రీధర్‌గౌడు, ఎల్లగౌడు, దిలీప్‌రెడ్డి, మర్రి మణి, రంగనాథం, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, హేమసుందర్ రెడ్డి, ఆర్మీ రామయ్య, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, బ్రహ్మం, మల్లి పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్యులు

చాగలమర్రి, మార్చి 16: చాగలమర్రి గాంధీ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు లక్ష్మణబాబు, నాయకులు, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చెలరేగిన మంటలు

చాగలమర్రి, మార్చి 16: చాగలమర్రిలోని టోల్ ప్లాజా సమీపంలో ప్రమాదవశాత్తు చెత్తా చెదారానికి నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. రహదారి పక్కనే నర్సరీ ఉండటం, మంటలు అధికం కావడంతో ఆళ్లగడ్డ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో వారు స్పందించి ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పి వేశారు. దీంతో నర్సరీకి అగ్ని ప్రమాదం ముప్పు తప్పింది.

మధ్యాహ్న భోజనం పరిశీలన



చాగలమర్రి బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవోలు

చాగలమర్రి, మార్చి 16: చాగలమర్రిలోని బాలికోన్నత పాఠశాలలో శనివారం బాలికల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల పరిశీలించారు. నాణ్యతగల కోడిగుడ్లు, భోజనం సక్రమంగా అందించాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని అన్నారు. అనంతరం పది విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, సీఆర్పీలు పాల్గొన్నారు.

రైతులకు టీడీపీ నాయకుల పరామర్శ




కాలిపోయిన పంటను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

డోన్(రూరల్), మార్చి 16: మండలంలోని మల్లెంపల్లి గ్రామంలో నష్టపోయిన రైతులను టీడీపీ నాయకులు గోసానిపల్లె మల్లయ్య, వలసల రామక్రిష్ణ, శ్రీనివాసులు యాదవ్ పరామర్శించారు. మల్లెంపల్లికి చెందిన బోయ ఆనంద్ 5 ఎకరాల పొలంలో అరటితోట పంటను సాగు చేయగా.. ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతై కాలిపోయింది. ఈ పంట పది రోజుల్లో కోతకు వచ్చే అవకాశం ఉందని, అగ్ని ప్రమాదంలో పంట కాలిపోయి బూడిదైందని, అధికారులు వెంటనే స్పందించి ఆదుకోవాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 16: ఈ నెల 19 నుంచి 23 వరు వెస్ట్ బెంగాల్‌లోని హుగ్లీ ప్రాంతంలో జరగబోయే 48వ జాతీయ స్థాయి సీనియర్ యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారని రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాశ్ శెట్టి తెలిపారు. శనివారం స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో జిల్లా నిరుద్యోగ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు చిన్న సుంకన్న, యోగా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



డోన్ ఏరియల్ వ్యూ



కోడ్ వచ్చేసింది

డోన్, మార్చి 16: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో డోన్ నియోజకవర్గంలో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. కేంద్ర ఎన్నికల కమిషన్ శనివారం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడంతో ఎన్నికల కోలాహలం నెలకొంది. డోన్ నియోజకవర్గంలో మొత్తం 2,24,113 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషుల ఓటర్లు 1,10,457 మంది ఉండగా.. మహిళా ఓటర్లు 1,13,585 మంది ఓటర్లు ఉన్నారు. థర్డ్‌జెండర్ ఓటర్లు 69 మంది ఉన్నారు. నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు 293 ఉన్నాయి.

● ఎన్నికల కోడ్ అమలులోకి..

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో డోన్ నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. వలంటీర్లు ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశించింది. మంత్రులు అధికారిక వాహనాలను వినియోగించరాదని ఆదేశించింది. మంత్రులు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనరాదని కోడ్ నిబంధనలు చెబుతున్నాయి.

● కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డోన్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. ఎన్నికల కోడ్‌పై డోన్ ఆర్డీవో కార్యాలయంలో సోమవారం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పిస్తామని తెలిపారు.

'పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి'





శిరివెళ్లలోని పదో తరగతి పరీక్ష కేంద్రం, రివిజన్ చేస్తున్న పదో తరగతి విద్యార్థులు



చాగలమర్రిలోని పది పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవోలు

శిరివెళ్ల, మార్చి 16: మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో శంకర్ ప్రసాద్ శనివారం తెలిపారు. యర్రగుంట్ల-1 కేంద్రంలో 170 మంది విద్యార్థులు, యర్రగుంట్ల-2లో 170 మంది, శిరివెళ్లలోని మోడల్ స్కూల్‌లో 150 మంది, జడ్పీ ఉన్నత పాఠశాలలో 140 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన బెంచీలు, సరైన వెలుతురు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను ఎంఈవో పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎంఈవో తెలిపారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

చాగలమర్రి, మార్చి 16: చాగలమర్రి గ్రామంలోని బాలుర, బాలికోన్నత, సెయింట్ ఆన్స్ పాఠశాలలో 18 నుంచి జరుగనున్న పది పరీక్షల కేంద్రాలను ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల పరిశీలించారు. శనివారం ఆయా కేంద్రాల్లో విద్యార్థుల మౌలిక వసతులను పరిశీలించి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సీఎస్, డీవోలకు సూచించారు. విద్యార్థులకు తాగునీరు, మెడికల్ కిట్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలని అన్నారు. 906 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, 40 మంది ఇన్విజిలేటర్లను నియమించామని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం కోటయ్య, పీడీ దాదాపీర్, సీఆర్పీలు ఉన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

బేతంచెర్ల, మార్చి 16: మండలంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలో డోన్ పట్టణంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సామాజిక సేవా కార్యకర్త డి.మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ కుల్లాయిరెడ్డి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నజీర్ అహ్మద్, లక్ష్మణ్, మహేష్, ఊర్మిళ పాల్గొన్నారు.

'వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, మార్చి 16: గ్రామాల్లో ప్రజలు వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఇమ్రాన్, సుల్తాన, అంజలి సూచించారు. శనివారం ప్రభుత్వ వైద్యశాలలో వారు మాట్లాడుతూ రోజు రోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఉదయం 10 గంటలు దాటిన తరువాత అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. తరచూ మంచి నీరు, మజ్జిగ తాగుతుండాలని, బయటకు వెళ్లాల్సి వస్తే టోపి, గొడుగు వాడాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

'ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు'

దొర్నిపాడు, మార్చి 16: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ సురేష్ హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని ప్రజలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రామయ్య, మౌలాలి, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

బేతంచెర్ల, మార్చి 16: పట్టణానికి సమీపాన కొలుములపల్లె రహదారిలో వెలసిన చౌడేశ్వరి మాత ఆలయంలో నూతన విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు హుశేన్ రెడ్డి, మల్లు సుబ్బారెడ్డి, హుశేన్ రెడ్డి, పోలూరు వెంకటేశ్వరరెడ్డి, మధుమోహన్‌రెడ్డి, రఘురామిరెడ్డి, శేఖర్, రామస్వామి, నాగమోహన్, భజన కృష్ణయ్య పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాధికారం కల్పించింది టీడీపే

బేతంచెర్ల, మార్చి 16: రాష్ట్రంలో బీసీలకు రాజ్యాధికారం కల్పించిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీనేనని టీడీపీ మండల కన్వీనర్ ఉన్నం ఎల్లనాగయ్య అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన బీసీ డిక్లరేషన్ సమావేశంలో పట్టణ టీడీపీ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, పోలూరు రాఘవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబుతోనే బీసీలకు రాజ్యాధికారం వచ్చిందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న బీసీ సోదరులందరూ అన్ని రంగాల్లో ముందుండాలనే ఉద్దేశంతో ఆనాడు టీడీపీ సబ్సిడీ రుణాలు ఇచ్చిందన్నారు. బీసీల జీవితాలలో మార్పు తెచ్చిన ఘనుడు చంద్రబాబే అన్నారు. కార్యక్రమంలో భీమేష్, శ్రీనివాసులు యాదవ్, పూజారి రామాంజనేయులు, టైలర్ రాముడు, రవీంద్ర నాయక్, నాగరాజు, రూబెన్, రేగటి భీమారెడ్డి, జనసేన నాయకులు నాగరాజు, చల్లా మద్దిలేటి స్వామి, శ్రీకంటి మధు, లోకేశ్వరరెడ్డి, పుట్టపాశం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.9.13 లక్షలు



ఈవో, చైర్మన్‌కు గండ దీపాలు అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల, మార్చి 16: మద్దిలేటి నరసింహ స్వామి క్షేత్ర ఆదాయం రూ.9.13 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈవో రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడు శనివారం తెలిపారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండ దీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ9,13,895 దేవ స్థానానికి ఆదాయం లభించినట్లు వారు తెలిపారు. అదేవిధంగా భక్తుల ఇంటి ఇలవేల్పు ఆరాధ్య దైవం కావడంతో క్రిష్ణగిరి మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఎంఈ రామక్రిష్ణుడు, ఎంఈ విజయభాస్కర్‌లు 2.670 కేజీల 3 వెండి హారతులు (నాగహారతి, సింహహారతి, కుంభహారతి)లను అందజేశారు. అలాగే నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం భీమునిపాడు గ్రామానికి చెందిన టి.మధుసూదన్ స్వామివారికి 2.30 గ్రాముల వెండి కిరీటం బహూకరించారు. దాతలకు ఆలయ మర్యాదలతో సత్కరించారు.

కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం



క్షీరాభిషేకం చేస్తున్న వేద పండితులు, ఆర్యవైశ్యులు

చాగలమర్రి, మార్చి 16: చాగలమర్రిలోని కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవాన్ని ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. వాసవీమాత పతాకాన్ని ఆలయ ధర్మకర్త శివప్రసాద్ ఆవిష్కరించారు. వేద పండితుడు పెద్ద శాస్త్రి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం, మహన్యాస రుద్రాభిషేకం, గణపతి పూజ, కలశ స్థాపన పూజలను ఉభయదారులతో నిర్వహించారు. ఆలయం ప్రతిష్ఠించి 89 ఏళ్లు పూర్తి కావడంతో అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారు. మహిళలతో సామూహికంగా కుంకుమార్చన, పల్లకీ ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, ఆర్యవైశ్యులు నవతా ప్రసాద్, సుబ్రహ్మణ్యం, మల్లికార్జున, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, ఉదయ్, సుగుణాకర్, సాయి సుదర్శన్, మహిళలు పాల్గొన్నారు.

'బాలికల సంరక్షణ అందరి బాధ్యత'



బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల

చాగలమర్రి, మార్చి 16: బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల అన్నారు. శనివారం చాగలమర్రి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయలో బేటి బచావో.. బేటి పడావో పోషణ్ పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలకు పోషణ్ పక్షోత్సవాలపై అవగాహన కల్పించి వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలైన బాలికలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో సునీత, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

'టీడీపీతోనే బీసీల సంక్షేమం'

శిరివెళ్ల, మార్చి 16: రాష్ట్రంలోని బీసీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎంపీటీసీ, బెస్త సంఘం కార్యవర్గ సభ్యుడు కొండబోయిన బాలచంద్రుడు అన్నారు. శిరివెళ్లలోని 96వ బూత్‌లో టీడీపీ సూపర్-6 మేనిఫెస్టోలోని అంశాల గురించి ప్రజలకు వివరిస్తూ శనివారం పత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి హోదాలో బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండబోయిన కృష్ణమోహన్, ముత్యాల మహేష్, జగదీష్, నవీన్, హరి, కొండబోయిన ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



వాసాపురంలో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

రుద్రవరం, మార్చి 16: మండలంలోని వాసాపురంలో కొలువుదీరిన వెంకటేశ్వర స్వామి, లక్ష్మిగోదాదేవి అమ్మవారు, మానస లింగేశ్వరస్వామికి, త్రిపుర సుందరీదేవి అమ్మవార్లకు శనివారం అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా లక్ష కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

నరసింహుడికి ప్రత్యేక పూజలు

మండలంలోని నరసాపురం, రుద్రవరం నరసింహస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లోని ఆలయాల్లో అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

అరాచక పాలనకు తెర పడింది

● వచ్చేది టీడీపీ ప్రభుత్వమే

● డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మార్చి 16: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వైసీపీ అరాచక పాలనకు తెరపడిందని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ అధికారం అడ్డం పెట్టుకుని సీఎం జగన్, మంత్రులు ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిందే తప్ప ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. వైసీపీ తన నియంతృత్వ పాలనతో ప్రతిపక్ష నాయకులను, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిందని అన్నారు. వైసీపీ అరాచకాలను ఎదురొడ్డి టీడీపీ ఐదేళ్లపాటు అలుపెరుగని పోరాటం చేస్తూ వచ్చిందన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వైసీపీ దౌర్జన్య పాలన ఇక ముగిసిపోయినట్లే అన్నారు. ఇక నుంచి ప్రజలు స్వేచ్ఛగా తమ గళం వినిపించవచ్చన్నారు. రాష్ట్ర ప్రజలకు వైసీపీ నుంచి విముక్తి కల్పించేందుకే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడిందన్నారు. ఈ ఎన్నికల్లో వచ్చేది టీడీపీ కూటమి ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. డోన్ నియోజకవర్గ ప్రజలకు తాను అన్ని రకాలుగా అండగా ఉంటానని కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు.

'ఓటు హక్కును వినియోగించుకోవాలి'



చిలకలూరు గ్రామంలో అవగాహన కల్పిస్తున్న సీఐ చంద్రబాబు

రుద్రవరం, మార్చి 16: ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ చంద్రబాబు సూచించారు. మండలంలోని ఎర్రగుడిదిన్నె, చిలకలూరు, చందలూరు గ్రామాల్లో శనివారం బీఎస్ఎఫ్ సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రజల్లో చిన్న చిన్న విషయాలకు ఘర్షణకు పాల్పడవద్దన్నారు. ప్రశాంతంగా పల్లె ప్రజలు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నిరంజన్‌రెడ్డి, బీఎస్ఎఫ్ దళాలు ఉన్నారు.

టీడీపీలో చేరిన ఎన్.వెంకటరామరాజు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 16: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకట రామరాజు తెలుగుదేశం పార్టీలో చేరారు. శనివారం ఉండవల్లిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్ర బాబు నాయుడు నివాసంలో జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బ్రాహ్మణుల సమస్యలు, సంక్షేమం, కార్పొరేషన్ పునరుద్ధరణ కోసం నారా లోకేశ్ స్పష్టమైన హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.